# టార్చిలైటు

రెడ్డిపాలెం అని ఓ చిన్న పల్లెటూరు. ఈ గ్రామంలో బోర్డు ఎలిమెంటరీ స్కూలు పెట్టి ఓ సంవత్సరం కూడా కాలేదు. అంతకుపూర్వం ఓ వైదికాయన వీథిబడి పెట్టుకొని పదిమంది పిల్ల కాయలకి చదువు చెప్పుకొంటూ ఉండేవాడు. నిరుడు సంవత్సరం జిల్లా బోర్డు ఎన్నికలలో గరటయ్య అని ఆ పక్క వూరురైతు ఒకాయన గెలిచి, ప్రెసిడెంటు అయ్యాడు. ఆయనగారికి రెడ్డిపాలెం అంటే ఎంతో మోజు. ఆ రెడ్డి పాలెంలో పదియిళ్ళ వాళ్ళు కాపులు బలవంతులున్నారు. తెల్లవారి లేస్తే వాళ్ళదగ్గర ఇంత తెచ్చుకోవడం, ఇవ్వడం వాళ్ళకీ వాళ్ళకీ తౌంభయి లావాదేవీలు. అందువల్ల తన ప్రెసిడెంటుగిరీలో ఆ గ్రామానికి కొన్ని శాశ్వతమయిన ఉపకారాలు చేయాలని, మీటింగులో బోర్డుస్కూలు మంజూరు చేయించి, పదిహేనువందల రూపాయలతో బిల్డింగు కట్టించి వీథి బడిలో చదువుకొనే పిల్లకాయలనందరినీ బోర్డు స్కూలులో చేర్పించాడు ప్రెసిడెంటు.

ఇద్దరు టీచర్లకు చాలినంత మంది పిల్లలు లేనందువల్ల పెంటలమీద తిరిగే చాకలి, మంగలి, కుమ్మరి, వొడ్డె, సాలె,గొల్ల, యానాది వగైరా ప్రతి పిల్లకాయని తీసుకువచ్చి ఓ అరవయి మందిని పోగుచేసి ఆ స్కూలులో చేర్పించాడు ఆ ప్రెసిడెంటు.

ఈ సంవత్సరమే కొత్తగా పెట్టిన స్కూలుయినందువల్ల ఈ యేడు ఈ స్కూలులో కూడా ఆరోగ్యవారం జరిపి, పిల్లకాయలచేత ఆటలాడించి బహుమతుల్వివలసిందని ప్రెసిడెంటు గారి దగ్గరనుండి హెడ్మాస్టరుకు తాఖీదు వచ్చింది, అయితే దీనికయ్యే ఖర్చులు జిల్లాబోర్డు భరించుకొనే స్థితిలో లేనందువల్ల గ్రామంలోని రైతులవల్లా, గ్రామస్థుల వల్లా తలాకొంచెంగా చందాలు వేయించి, ఆ పైకంతోనే ఆరోగ్య వారం జరపవలసిందని కూడా ఆ తాఖీదులోనే వ్రాశారు ప్రెసిడెంటుగారు.

ఆ హెడ్మాస్టరు క్రైస్తవుడు, పేరు జకరయ్య. పాపం బీదవాడూ, భయస్థుడూను, ప్రెసిడెంటుగారి ఉత్తరువు తీసుకొని వెళ్ళి గ్రామంలో పదిమంది పెద్దలకూ చూపి, తలా

కొంచెం చందావేసి సహాయం చేయవలసిందని కోరాడు జకరయ్య. ఈ ఆరోగ్యవారాలూ, వేడుకలూ, వీటి ఉపయోగాలూ వాళ్ళ కంతగా అర్థమైనా కాకపోయనా, ఏమో పిల్లకాయలచేత ఆటలాడించి బహుమతులిస్తానని అంటున్నాడు అయ్యవారు అని, పదిమంది కాపులూ, బ్రాహ్మణులూ, గ్రామాధికార్లూ కలిసి చందాలువేసి, ఓ యిరవైరూపాయలు జమచేసి అతనిచేతిలో పెట్టారు.

స్కూళ్ళ డిప్టీ ఇన్‌స్పెక్టరును పిలుచుకొనివచ్చి, ఆయన సమక్షంలోనే పిల్లకాయల చేత అరమైలు పరుగు, నూరుగజాల నడక, ఎక్కువఎత్తు ఎగరడం, ఎక్కువ పొడుగు దూకడం, బల్లలకింద కాళ్ళకు గోతాలు కట్టుకొని నడవడం, కింద చల్లిన పువ్వులేరి కుప్పగా పెట్టడం– ఒక రకమేమిటి, పట్నవాసపు బడులలో ఆడించే ఆటలన్నీ పిల్లకాయల చేత ఆడించి, ఆటల్లో గెలుపొందిన పిల్లకాయలకు ఒకరికి సూటుకేసు, ఇంకొకరికి టార్చిలైటు, మరొకరికి పెద్దసైజు జపాను అద్దం, ఇంకొకరికి ఫౌన్‌టేన్ పేనా, వేరొకరికి సబ్బుపెట్టి, ఇంకొకరికి గొడుగు– ఇట్లాగే తలా ఒక వస్తువు బహుమతులు యిచ్చాడు.

కాని ఆ రాత్రికే గ్రామంలో అల్లకల్లోలం బయలుదేరింది.

ఆటల్లో గెలిచి బహుమతులు తీసుకొన్న పిల్లకాయలందరూ– ఒకడు చాకలివాడు, ఇంకొకడు మంగలివాడు, మరొకడు వొడ్డెవాడు, యానాదివాడు,సాలివాళ్ళ పిల్ల, కమ్మరివాళ్ళ పిల్ల – ఈ రకంగా అందరూ బీదవాళ్ళ పిల్ల కాయలే. గ్రామంలో డబ్బుగలవాళ్ళు, గొప్పవాళ్ళూ, పలుకుబడి గలవాళ్ళు యిచ్చిన డబ్బుతో వస్తువులు కొనడమూ, ఆ వస్తువులు చివరకు వాళ్ళ చేతికింద నీళ్ళుతాగే నౌకర్ల పిల్లకాయ లెత్తుకొనిపోవడమూ జరిగింది.

గ్రామస్థులు కుతకుత ఉడికిపోతున్నారు. తమ పిల్లకాయలకు వస్తాయనుకొన్న వస్తువులన్నీ కూటికీ గుడ్డకూ మొగంవాచిన దరిద్రజీవుల సంతానం ఎత్తుకొనిపోయారు. అందులో తమ స్వగ్రామంలో, తమ కళ్ళయెదుట తెల్లవారిలేస్తే తమ చెప్పుచేతుల్లో ఉండి, తమకింద తాబేదారీ పని చేసే నౌకర్ల బిడ్డలకు బహుమతులూ, తమ బిడ్డలకు వొఠి చేతులూను! పెద్ద రెడ్డిగారి అబ్బాయి ఒకటే గోల! కరణంగారి అబ్బాయి ఇంట్లోవాళ్ళని నిలవనివ్వడం లేదు. సాలెవాళ్ళ కిచ్చిన అద్దం తెచ్చి నాకిస్తావా, చస్తావా అని కాశయ్య కూతురు ఒకటే ఏడుపు! ఇంతెందుకు, చాకలివాళ్ళు, మంగలివాళ్ళూ, కుమ్మరివాళ్ళూ అందరూ సంతోషంతో పొంగిపోతూ పండగ చేసుకొంటూ ఉంటే పెద్ద గ్రామస్థుల ఇళ్ళల్లో ఆరోజు రోజంతా ఎండగలూ, ఉపవాసాలూను!

హెడ్డుమాస్టరు జకరయ్య కావలెనని వాళ్ళందరికీ ఈ అవమానం చేశాడని వాళ్ళ నమ్మకం. ఊళ్ళో పెద్దలనుకొనే పదిమందీ చేరి కూడబలుక్కున్నారు. ఆ మర్నాడు ఉదయాన్నే మీటింగు పెట్టి జకరయ్యను పిలిపించి, "మా దగ్గర డబ్బులు దండి, ఊళ్ళో వాళ్ళకి పంజారం చేస్తావా? ఇంత తలపొగరా నీకు? మా డబ్బుతో కొన్న వస్తువులు మళ్ళీ వాఫసు తీసుకొనివచ్చి, మా పిల్లకాయలకు పంచిపెడుతావా, లేక నిన్ను పట్టుకొని మెత్తగా తన్నమంటావా" అని పదిమందీ కస్తీచేశారు.

జకరయ్య గడగడలాడిపోయాడు. ఒంటరిగాడు. అది గ్రామంలో పెద్దపులులను కొనేవాళ్ళందరూ చేరి చేసిన పంచాయతీ, అదిగాక, పబ్లికు మీటింగులో డిప్టీ ఇన్స్పెక్టరు గారి సమక్షంలో పంచిపెట్టిన బహుమతి వస్తువులు- వాటిని మళ్ళీ తాను ప్రైవేటుగా ఊడబెరుక్కోవచ్చునా? ఈ సంగతి జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారికి తెలిస్తే తన నౌకరీకి మోసం కదూ, మరి తీసుకురాకపోతే గ్రామస్థులు బ్రతకనిస్తారా?

గండకత్తెర చుట్టుకొన్నట్టున్నది అతగాడికి.

జకరయ్య అట్టే ఆలోచించి, "స్వామీ! మీకు దణ్ణంపెట్టుతా. ఈ బహుమతులిచ్చిన వస్తువులు వాఫసు తీసుకొని వచ్చేపని నా నెత్తిన పెట్టకండి. మీరందరూ చేరి నా మీద నేరం పెట్టారు కాబట్టి, నా స్వంతడబ్బుతో ఆ వస్తువులు మళ్ళా కొత్తవి కొని మీకు ఇచ్చుకొంటాను. అంత మాత్రం దయపెట్టండి" అని వాళ్ళ కాళ్ళు పట్టుకొన్నాడు. కాని, వారంతా పెద్దమనుష్యులు- ఒప్పుకొంటారా వారు? జకరయ్య ఎంత చెప్పినా, ఎన్ని విధాల ప్రార్థించినా, "ఆ వస్తువులు ఆ పిల్లకాయల దగ్గర ఉండడానికి మాత్రం వీలు లేదు. పోయి నీవు వాఫసు తీసుకొని వస్తావా రావా?" అని వాళ్ళు నిక్కచ్చి చేశారు.

జకరయ్యకు దిక్కుతోచక, ఆ వెళ్ళడం వెళ్ళడం ఎకాయెకిని జిల్లాబోర్డు ప్రెసిడెంటు దగ్గరకి వెళ్ళి, జరిగిన విషయమంతా ఆయనతో మనవి చేసుకొని, రక్షించండని ఆయన కాళ్ళమీద పడ్డాడు.

ఆ ప్రెసిడెంటు అసాధ్యుడు; రాజకీయవేత్త; దూరాలోచనపరుడు; ముందు సంవత్సరం రాబోయే ఎన్నికల్లో శాసనసభకి కూడా నిలబడాలని చూస్తున్నాడు. జకరయ్య చెప్పుకొన్నదంతా విని "నేను రేపు మీ గ్రామానికివచ్చి, గ్రామస్థులతో స్వయంగా మాటాడి వ్యవహారం పరిష్కారం చేస్తా. నీకేం భయంలేదు, పొ"మ్మన్నాడు.

జకరయ్య ప్రెసిడెంటు దగ్గరకు పోయిన సంగతి గ్రామస్థులకు తెలిసి, వాళ్ళు వెంటనే బహుమతులు తీసుకొన్న పిల్లకాయల తల్లిదండ్రులను రచ్చకు పిలిపించి, బెదరించి, వాళ్ళ దగ్గరి వస్తువులన్నీ వాఫసు తీసుకొని, పెద్దరెడ్డి స్వాధీనంలో పెట్టుకొన్నారు.

భయపడి అందరూ వస్తువులు వాఘసు యిచ్చారు. కాని, టార్చిలైటు తీసుకొన్న చాకలివాళ్ళ పిల్లవాడుమాత్రం వాఘసు ఇవ్వలేదు. వాడి తండ్రి రంగం, మోల్మేను వగైరా పట్నాలు తిరిగివచ్చినవాడు. మనిషి- ఎర్రగా నేత్రాలూ వాడూ- ఆజానుబాహువు: ఏడడుగుల ఎత్తుంటాడు. చేతులకు మురుగులు, దండకడియం, అయిదు వేళ్ళకీ ఉంగరాలు, మొలకు బిళ్ళల మొలతాడు, చెవులకు తమ్మెట్లు-చూడ్డానికి మహా జబర్దస్తీగా ఉంటాడు. గ్రామస్థులెంత బెదిరించినా వాడు టార్చిలైటు వాఘసు ఇవ్వకుండా మొండొడ్డుకొని కూర్చున్నాడు. పైగా, ఇచ్చినవాళ్ళని కూడా చీవాట్లు పెట్టి పురెక్కించాడు.

మరునాడు ఉదయం జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారు గ్రామానికి వచ్చేవరకు వస్తువులు చేజారి వాఘసు ఇచ్చిన వాళ్ళూ, వాళ్ళ బంధువులూ, చాకలివాళ్ళూ మొదలైన అలగాజనం అందరూ యేభయిమంది తోడయి, పెద్దరెడ్డి యింటిమీద పడి, “చాకలివాడు వస్తువు ఇవ్వనిదీ మేము మాత్రం వాఘసు ఇస్తామా? మా వస్తువులు మాకిచ్చివేయవలసిం”దని కర్రలూ కత్తులూ పట్టుకు తయారయ్యారు.

ఇంతలో జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారు రాగానే వారిని పెద్దరెడ్డి యింటికి పిలుచుకొని పోయి బసచేయించారు.

పదిగంటలదాకా ఎవరెవరు ఏమేమి మాటాడుకొన్నారో అంతా గోప్యంగా జరిగిపోయింది. పదకొండు గంటలకు కారెక్కి హెడ్ క్వార్టర్సుకు చక్కా వెళ్ళిపోయాడు ప్రెసిడెంటు.

రంగంచాకలివాడి హుషారీ చూచుకొని అలగాజనమంతా ఏకమై నడుములు బిగిస్తున్నారు. పెద్దరెడ్డి వీథిలోకి రావడం మానేసి రహస్యంగా మాలవాళ్ళకు చెప్పి పంపి, కల్లుపోయిస్తాననీ, డబ్బులిస్తాననీ బేరాలు చేస్తున్నాడు.

వ్యవహారం ముదిరి కొట్టుకోవడందాకా వచ్చేవరకు, మునసబు కరణాలు చల్లగా తప్పుకొని, గ్రామపరిస్థితులు పోలీసువారికీ, మేజస్ట్రేటుకీ రిపోర్టు పంపించారు.

గ్రామంలో అయితే జకరయ్య ప్రస్తావన మళ్ళా ఏమీ లేదుకాని, గ్రామస్థులతో మాటాడి ప్రెసిడెంటుగారు వెళ్ళిపోయిన తరువాత ఒకనాటి ఉదయం జకరయ్యకు పోస్టులో ఓ కవరు వచ్చింది. అది చింపి చూస్తే ఇట్లా ఉంది:

తే: 16-11-38.

"జిల్లాబోర్డు ఆఫీసు,

ఉత్తర్వు

ఇటీవల మీగ్రామంలో జరిగిన ఆరోగ్య శిశువార వేడుకల సందర్భంలో మీరు అజాగ్రత్తగా ప్రవర్తించి, గ్రామంలో అనవసరమైన కలతలూ, పార్టీలూ పెంచి, పాఠశాల పురోభివృద్ధికేగాక, గ్రామ పురోభివృద్ధికి కూడా భంగకరంగా నడుచుకొన్నందువల్ల మీరు స్కూలు టీచరుగా ఉండడానికి అనర్హులని తీర్మానించి, మీ సంజాయిషీతో నిమిత్తం లేకుండానే మిమ్మల్ని ఈ తేదీ లగాయతు నౌకరీ నుండి మర్తరబు చేయడమైనది.

(సం) గరటయ్య,

ప్రెసిడెంటు"